అతని ప్రాణానికి అపాయం అన్న సాకుతో డూప్లికేట్స్‌ని తయారుచేసి తరువాత అతనినే గదిలో బంధించి, పిచ్చివాడిని చేసి, తిండీ నీరు యివ్వకుండా హింసించి ఈలోగా అతని పేరు మీదున్న ఆస్తిపాస్తు లన్నీ పరిశ్రమలూ అన్నీ తన ద్వారా నూ, శరత్ ద్వారానూ మాధురి పేరు మీదకు బదిలీ చేయించి ఇప్పుడు అతనినీ తనను, శరత్‌నీ కూడా చంపించివేయడానికి పన్నిన పన్నాగం ఇది.

సురేష్ మంచం మీద కూర్చుండిపోయాడు. తనెంత మూర్ఖుడో ఇప్పుడు తెలుస్తోంది. తులసి చెప్తూనే వుంది తనకు. ఈ వుద్యోగం చేయవద్దు అని. తనే డబ్బుకి ఆశపడి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు.

సురేష్ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినాయి.

"తులసీ! ప్లీజ్! ఎక్స్‌క్యూజ్‌మీ తులసీ" లోలోపలే పశ్చాత్తాప పడసాగాడు.

తెల్లారేవరకూ నిద్ర పట్టలేదతనికి.

తన జీవితంలో ఇదే ఇంత భయంకరంగా గడిచిన రాత్రి. వీలయినంత త్వరగా ఇక్కడినుంచి తప్పించుకోవాలి ఎలా? ఒకే ఒక్కరోజు గడువు-

"గుడ్‌మాణింగ్ సర్! రాత్రి సరిగ్గా నిద్ర పట్టినట్లు లేదు మీకు. రాత్రంతా పచార్లు చేస్తూనే వున్నారు" విక్కీ గడపలో చిరునవ్వుతో నిలబడి వుంది.

సురేష్ ఆమెవేపు భయంగా చూశాడు. తను రాత్రంతా పచార్లు చేస్తున్నట్లు ఆమె కెలా తెలిసింది? తన గది గోడల్లో రహస్యంగా కెమెరాలేమయినా వున్నాయా?

తన మూమెంట్స్ అన్నీ వాచ్ చేయటానికి విక్కీ నియోగించ బడిందా? ఒకవేళ అదే నిజమైతే తను పారిపోవడానికి విక్కీయే అడ్డంకి అవుతుంది.

త్వరత్వరగా ఆలోచించసాగాడు సురేష్. విక్కీని మార్గం నుంచి తప్పించాలన్నా, ఆమెను మోసగించాలన్నా తను వెంటనే నటన ప్రారంభించాలి! తనామెను ఇష్టపడుతున్నట్లూ, ఆమెనే పెళ్ళి చేసుకోవాలని కలలు కంటున్నట్లూ.

"హ-అవును విక్కీ! రాత్రంతా నువ్వే కలలో చాలా చేశావు! నీకు నిజం చెప్తున్నాను ఎంతోమంది అమ్మాయిలను చూశాను గానీ నీ అంత అందం, సెక్స్, మెజర్‌మెంట్స్ వున్న అమ్మాయిలెవరినీ చూడలేదు."

ఆమె కళ్ళల్లో తనూహించిన మార్పు కనిపించింది. పెదాలు విచ్చుకున్నాయి. అదే సమయం మరింత అలరించాలామెను.

"విక్కీ! రాత్రంతా నా మనసులో విషయం నీకెలా చెప్పాలా అనే విషయమే ఆలోచిస్తూండిపోయాను. నువ్వు వప్పుకుంటే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

"మీకు బ్రేక్‌ఫాస్ట్ ఏం తయారు చేయాలో చెప్తే-"

సంభాషణ మారుస్తూ అందామె.

"నా మాటకు సమాధానం చెప్పవేం విక్కీ?"

"నాకిదివరకే పెళ్ళయింది సర్! నా హజ్‌బెండ్ కూడా ఇదే ఎస్టేట్‌లో వర్క్ చేస్తున్నారు. మీకు బ్రేక్‌ఫాస్ట్ ఏం తయారు చేయమంటారో చెప్తే...."

సురేష్ నిరాశపడ్డాడు. అలాగయితే రాత్రి ఆమె అంత ఎగ్రెసివ్‌గా ఎందుకు ప్రవర్తించినట్టు!

"నన్ను చాలా నిరాశ పరిచావు విక్కీ" దిగులుగా అన్నాడతను.

"బ్రేక్‌ఫాస్ట్ ఏం చేయమంటారో చెప్తే..." తిరిగి అందామె నవ్వుతూ.

ఆమె చాతీ యధాప్రకారం మరింత ముందుకు పొంగింది.

"నీ ఇష్టం విక్కీ! నన్నేమీ అడగకు" భారంగా అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. తనను తానే అభినందించుకున్నాడు అతను.

కొంతవరకూ తన నటన బాగానే వుంది. కానీ వుపయోగం కనిపించటంలేదు. తననెవరు రక్షించగలరీ నరకం నుంచి??? ఒకటి రెండురోజులే గడువు. బయటివాళ్ళు వచ్చి తనను రక్షించటం కల్ల. కేవలం ఎస్టేట్‌లో వాళ్ళే ఎవరయినా-

హఠాత్తుగా ప్రత్యూష గుర్తుకొచ్చిందతనికి. అతని గుండెలు ఆనందంతో వేగంగా కొట్టుకున్నాయి. అవును ప్రత్యూష!

ప్రత్యూషను కలుసుకోవటమెలా సాధ్యం?

అతని దృష్టి ఎదురుగ్గా వున్న ఫోను మీద పడింది. అది ఇంటర్‌కమ్ ఫోన్. మాధురీ ఎస్టేట్స్, మాధురీ ఇండస్ట్రీస్ అన్నీ ఆ ఫోన్ ద్వారా కనెక్ట్ చేయబడి వున్నాయి. ప్రత్యూష ఫోను నెంబర్ తనకు తెలుసు. అర్జున్ ఆఫీస్ రూమ్‌లో వున్న నెంబర్ రింగ్ చేస్తే ముందు ప్రత్యూషే రిసీవ్ చేసుకుంటుంది. తనా ఫోన్ ముందు రోజుల తరబడి ఫైల్స్ సంతకాలు చేస్తూ గడిపాడు గనుక నెంబర్ గుర్తుంది.

విక్కీ ట్రేలో ఫలహారం తీసుకొచ్చింది.

ఇప్పుడు ఆమె రూపమే కాదు, శరీరం కూడా కవ్విస్తోంది. వక్షోజాలు ఎక్కువభాగం నగ్నంగా కనబడుతున్నాయి.

"ఇది ఫ్రెంచ్ ప్రిపరేషన్ సర్...చాలా అద్భుతమైన వంటకం" నవ్వుతూ చెప్పింది.

సురేష్‌కి ఇప్పుడు ఆమె అందమూ, సెక్సూ, వంటకాలూ, ఇవేమీ ఆకర్షించటంలేదు. ఇంకొక్కరోజే తనకు గడువు అన్న విషయం చెవుల్లో మార్మోగుతోంది. తను వెంటనే ఏదోక ప్లాన్ ఆలోచించి అమలు పరచాలి.

"విక్కీ!" పిలిచాడతను.

"ఏం సర్?"

"ఫలహారం అయ్యాక కాసేపు డ్రయివింగ్ నేర్చుకుందామా?"

"ఇవాళంతా మనం ఇంట్లోనే గడపాలని సెక్యూరిటీ చీఫ్ ఫోన్ చేసి చెప్పాడు సర్! కొన్ని కారణాలవల్ల ఎవ్వరినీ బయటకు పోనియ్యరట! మీకు టీ కావాలా, కాఫీ కావాలా సర్!"

సురేష్ ముఖంలో కళ తప్పింది.

"కానీ-నేను స్వేచ్ఛగా తిరగవచ్చని మాధురీగారే చెప్పారు కదా?"

"అవున్సార్! కానీ ఈ ఒక్కరోజుకీ మీరు ఓపిక పడితే రేపటిన్నుంచీ అంతా స్వేచ్ఛే! మీకు టీ కావాలా, కాఫీ కావాలా సర్?"

"టీ" అన్నాడు సురేష్ "ఫలహారం అవసరంలేదు...తీసుకెళ్ళు."

ఆమె ట్రేతో లోపలికెళ్ళిపోయింది.

అతనికి అర్థమయిపోయింది.

తను తప్పించుకునే అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. లేచి గదిలో వేగంగా పచార్లు చేయసాగాడతను. ఆ టెన్షన్‌లో సరయిన ఉపాయాలు కూడా తట్టడంలేదు. కిటికీలో నుంచి చూస్తే బయట గేటు దగ్గర ముసలి నౌఖరు బీడీ తాగుతున్నాడు. ఉండుండి వాడి చూపులు తన కిటికీ వేపుకే మళ్ళుతున్నాయి. తను పారిపోకుండా అని కట్టుదిట్టాలూ చేసి వుంచారు. విక్కీ టీ తీసుకొచ్చింది.

సురేష్ ఆమె వంక చూడసాగాడు.

మెదడులో మెరిసింది ఆలోచన. అవును విక్కీని మోసగించాలి. అప్పుడే తను తప్పించుకోవడానికి మార్గం దొరుకుతుంది. టీ అతని చేతికందించిందామె. ఆమె చేతిని అందుకుని దగ్గరకు లాక్కున్నాడు.

ఆమె కిటికీలో నుంచి కనబడుతున్న నౌఖరుని చూసింది.

"ఇప్పుడు కాద్సార్? రాత్రికి! నిన్న రాత్రంతా మీరు పిలుస్తారేమోనని ఎదురు చూశాన్సార్-"

సురేష్ ఆశ్చర్యం నటించాడు.

"మైగాడ్! నువ్వు పిలుస్తావేమోనని నేను ఎదురుచూశాను"

ఇద్దరి పెదాలు కలుసుకున్నాయి. ఆమె చేతిలో కప్పు పెద్దశబ్దంతో కింద పడింది.

ఇద్దరూ చటుక్కున దూరంగా జరిగారు.

నౌఖరు అనుమానంగా కిటికీ వేపు చూశాడు.

"సారీ సార్! ఇంకో కప్పు తెచ్చిస్తాను" అంటూ కప్పు ముక్కలు ఏరుకుని బయటకు నడిచిందామె. ఆ నౌఖరుకి ఆమె కూడా భయపడుతోందని అర్థమయిపోయింది సురేష్‌కి.

అతనివేపు పరీక్షగా చూశాడు మరోసారి. తను గట్టిగా కొడితే అతను మళ్ళీ లేవడు. తనకా

నమ్మకం వుంది. కానీ వాడి దగ్గర పిస్టల్, కత్తిలాంటివేమయినా వుంటే మాత్రం కష్టం.

టైమ్ చూసుకున్నాడు సురేష్. పదయింది. ఈ పాటికి ఆఫీస్‌కి చేరుకుని వుంటుంది ప్రత్యూష. ఇదే సమయం తను ఫోన్ చేయటానికి! టేప్‌రికార్డర్ ఆన్ చేశాడు. మ్యూజిక్ శబ్దాలు ఇల్లంతా పరుచుకున్నాయి. ఇప్పుడు తను ఫోన్‌లో మాట్లాడినా నౌఖరుకిగానీ, విక్కీకిగానీ వినిపించదు. ఫోన్ దగ్గరకెళ్ళి త్వర త్వరగా రింగ్ చేశాడతను.

వెంటనే ప్రత్యూష గొంతు వినిపించింది.

"పి.ఏ.టు. ఎమ్.డి.సర్!"

"ప్రత్యూషా! నేను సురేష్‌ని! గుర్తు రాలేదూ? లైబ్రరీలో కలుసుకునే సురేష్‌ని! ఇంకా గుర్తు రాలేదా? మీరంతా కావాలనుకుంటే అందుకు నాకేం అభ్యరతరం లేదు- అన్నావు చూడు ఆ రోజు హోటల్లో... ఆ సురేష్‌ని" త్వరత్వరగా తననెవరయినా గమనిస్తున్నారేమో అని చుట్టూ చూడసాగాడతను.

"మైగాడ్! మీరా? ఎక్కడినుంచి మాట్లాడుతున్నారు?"

"ఇక్కడే మాధురీ ఎస్టేట్స్ నుంచి! ఇక్కడ ఫ్లాట్‌లో బంధించారు వీళ్ళు. ఇవాళ రాత్రిలోగా నేనిక్కడి నుంచి తప్పించుకుని పారిపోలేకపోతే నన్ను చంపేస్తారు ప్రత్యూషా! నాకిప్పుడు నీ సహాయం కావాలి నువ్వొక్క ర్తివే నన్ను రక్షించగలవ్."

ఆమె భయపడిపోయింది. అతని మాటలు అర్థం కావటంలేదు.

"మిమ్మల్నెందుకు చంపెయ్యటం?"

"అందతా తర్వాత చెప్తాను-ముందు నన్నెలా రక్షిస్తావో చెప్పు? ఇవాళ రాత్రివరకే గడువు."

ఆమె కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయింది.

"నాకేమీ తోచటంలేదు సురేష్ ! ఈ ఉద్యోగమే కొత్త. ఎక్కడేముందో, ఏం జరుగుతోందో నాకేమీ తెలీటంలేదు. అంతా అగమ్యగోచరంలా వుంది. మీరే ఏదయినా మార్గం చెప్పండి."

"నువ్వు ఎస్టేట్‌లోగానీ, ఇండస్ట్రీస్‌లోగానీ స్వేచ్ఛగా తిరిగే అవకాశముందా ప్రత్యూషా? నీ మీదేమైనా ఆంక్షలున్నాయా?"

"ఏమో ఖచ్చితంగా తెలీదు. నా ఫ్లాట్ కూడా ఎస్టేట్స్‌లోనే వుంది. నేను సిటీకెళ్ళవచ్చుగానీ, ఎవర్నీ కలుసుకోకూడదనీ, ఎవరితోనూ మాట్లాడగూడదని మాత్రం చీఫ్ వార్నింగ్ యిచ్చారు. నేనింతవరకూ సిటిలోకెళ్ళనే లేదు."

సురేష్‌కి కొంత ఆశ కలిగింది. తనాలోచించిన ఉపాయం అమలులో పెట్టవచ్చేమో? హఠాత్తుగా అతని దృష్టి గేటు దగ్గర్నుంచీ కిటికీ దగ్గరకొస్తోన్న నౌఖరు మీద పడింది.

"ప్రత్యూషా! అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ రింగ్ చేస్తాను" అనేసి ఫోన్ పెట్టేసి మళ్ళీ

పచార్లు చేయసాగాడు సురేష్.

నౌఖరు కిటికీ బయట మొక్కలకు పాదులు తీస్తున్నట్లు కాసేపు నటించి మళ్ళీ వెళ్ళి గేటు దగ్గర కూర్చున్నాడు.

విక్కీ 'టీ' తీసుకొచ్చింది.

కప్పు అందుకుంటూ ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు అతను.

ఆమె కూడా చుంబించి వెనక్కు జరిగింది. "రాత్రి వరకూ ఓపిక పట్టండి సర్!" కవ్వించే నవ్వు.

ఆమె బయటి కెళ్ళిపోయాక 'టీ' తాగి మళ్ళీ ఫోన్ దగ్గరకు వచ్చాడతను. టేప్‌రికార్డర్ సౌండ్ పెంచాడు. ప్రత్యూష మళ్ళీ ఫోన్‌లో కొచ్చింది.

"హలో ప్రత్యూషా! ఒకే ఒక్క ప్లాన్ వుంది. సాయంత్రం చీకటి పడ్డాక నువ్వు మీ కారులో మా ఫ్లాట్ దగ్గరకు రావాలి! ఏదో వంకతో ఫ్లాట్ దగ్గరకు రాగానే మీ డ్రయివర్‌తో చెప్పి కారు ఆపించు. నేను ఎలాగోలా వచ్చి కారు ఎక్కేస్తాను. ఇద్దరం సిటీలోకెళ్ళాక అక్కడనుంచి నేను పారిపోతాను."

ప్రత్యూష భయపడిపోయింది.

"ఆ తర్వాత నన్ను చంపెయ్యరు కదా?" భయంగా అడిగింది.

సురేష్ ఆ విషయం మర్చిపోయాడు. తనను ప్రత్యూష రక్షించిందని తెలిస్తే ఆమెను చంపకుండా ఎలా వదుల్తారు?

"అయితే ఇద్దరం కలిసే పారిపోదాం ప్రత్యూషా! నువ్వా యీ డెత్‌సెల్‌లో పనిచేయటం మంచిదికాదు. ఇక్కడ ఎప్పుడు ఎవర్ని చంపేస్తారో తెలీదు."

"అవును. నాకూ ఏదో అనీజీగా వుందిక్కడ! అంతా రహస్యంగా, తెరచాటు కార్యకలాపాల్లా జరుగుతున్నాయి అన్నీ. ఇది పెద్ద పరిశ్రమలకు సంబంధించిన ఆఫీసనిపించటం లేదు."

"సాయంత్రం ఏడు గంటలకు రాగలిగితే మంచిది ప్రత్యూషా! నా ఫ్లాట్ తెలీదు కదూ? ఎత్తుగా గుట్ట మీద వుంటుంది. ఎస్టేట్స్ రోడ్డు పక్కనే వుంటుంది కనుక...."

"నాకు తెలుసు. అది దాటాకే నా క్వార్టర్ వుంది. రోజూ ఆ హిల్స్ చూస్తూంటాను ఆఫీస్‌కెళ్ళి వచ్చేటప్పుడు."

"అయితే ఇంక ప్రాబ్లమ్ లేదు. సాయంత్రం ఏడు గంటలకల్లా రావాలి. ప్రత్యూషా! నీకోసం కిటికీ దగ్గర నిలబడి చూస్తుంటాను. నీ కారు ఆగగానే అయిదే నిమిషాల్లో చేరుకుంటాను."

"మరి మా కారు డ్రైవర్? వాడు మిమ్మల్ని చూస్తే?" హఠాత్తుగా గుర్తుకొచ్చినట్లు

అడిగిందామె.

"డోంట్‌బాదర్! అదంతా నేను చూసుకుంటాను."

ఫోన్ డిస్ కనెక్ట్ చేశాడు. వళ్ళంతా చెమటలు పట్టేసినయ్ ఆ కొద్దిసేపటికే. కాళ్లూ, చేతులూ వణుకుతున్నాయి. ఇదొక్కటే తనకున్న అవకాశం. ఈ అవకాశం విజయవంతం చేసుకోకపోతే ఆ తర్వాత అవకాశాలూ, టైమూ రెండూ వుండవ్.